# బలికోరని స్వార్థం

—అంజనీ ప్రసాద్

జైలు కటకటాల్లోంచి శూన్యంలోకి చూస్తున్నాడు చిరంజీవి. చుట్టూ వాతావరణం గురించి ఏమాత్రమూ ఆలోచన లేదు.

• • •

ఇరవై నాలుగేళ్ళు నిండిన చిరంజీవి ఆ సిటీలో ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. కంపెనీ ఉద్యోగంతో బాటు రెండు పోర్షన్లకు కాస్త ఇంచుమించు ఎటాచ్డ్‌గా ఉన్న ఒక చిన్న రూము కూడా సంపాదించాడు, ఇంటి ఓనర్ని కన్విన్స్ చేసి.

చిరంజీవి మితభాషి; మృదుభావంగా ఉంటాడు. తన పని తాను చూసుకుపోయే స్వభావం. స్వతహాగా అందగాడైన అతడికి కాలేజీలో చదివే రోజుల్లో చేసిన బాడీ బిల్డింగ్ మంచి ఛాతీని ఇచ్చింది. కాస్త తెల్ల రంగులో ఉన్న అతడు ఎలాంటి బట్టలు వేసుకొన్నా చాలా ఆకర్షణీయంగా కనిపిస్తాడు.

ఉదయం టిఫిన్ కానిచ్చి ఎనిమిది గంటలకు కంపెనీకి వెళ్ళి, మధ్యాహ్నం కంపెనీ కాంటీన్‌లోనే లంచ్ చేసి, సాయంత్రం అయిదు దాటాక గాని తిరిగి రాడు. సాయంత్రం స్నానం చేసి షికారుగా కాస్సేపు తిరిగి, ఏదో హోటల్లో భోజనం చేసి పెందలాడే రూముకు చేరుకొంటాడు. ఏ నవలో ముందేసుకుని నిద్ర వచ్చేవరకు చదువుతూనే ఉంటాడు. ఇదీ అతని దినచర్య.

మిగిలిన రెండు పోర్షన్లలో ఒక దానిలో ఎల్. ఐ. సి. ఆఫీసర్ శ్యామలరావు-భార్య, ఇద్దరు పిల్లలతో ఉంటున్నాడు. శ్యామలరావు కూడా కాస్త మితభాషి కావటం వల్ల అతడికి చిరంజీవి తరహా ఎంతో నచ్చింది.

మరో పోర్షన్‌లో ఫెన్సీషాపు ఓనరు సుదర్శనం ఉంటున్నాడు. రోజంతా బిజినెస్ చూసుకుని రాత్రికి ఇల్లు చేరుకొంటాడు సుదర్శనం. అతనికి పిల్లలు లేరు. భార్య ఎప్పుడూ ఏదో రోగంతో బాధ పడుతూ ఎక్కువ కాలం పుట్టింట్లో గడుపుతూ ఉంటుంది.

రాత్రి ఇంటికి వచ్చాక సుదర్శనాని కేమీ తోచక కాలక్షేపానికి చిరంజీవిని ఆహ్వానించేవాడు. ఎక్కువ సొస్కు కొట్టే అలవాటు లేని చిరంజీవి ఎంతో బోర్ ఫీలయ్యేవాడు. కాస్సేపు ముళ్ళమీద కూర్చున్నంత ఇబ్బంది పడి, వీలైనంత త్వరగా వదిలించుకొని తిరిగి తన రూముకు పోయేవాడు.

చిరంజీవి రిజర్వుడు స్వభావం సుదర్శనానికి కోపం తెప్పించింది. 'ఏదో సరదాగా పిలిస్తే, వీడికింత పొగరా!' కసిగా అనుకొన్నాడు.

శ్యామలరావు కూడా రోజంతా ఆఫీసు, తరవాత క్లబ్‌లో టెన్నిస్‌తో గడిపేవాడు. అందుచేత సుదర్శనానికి శ్యామలరావుతో కూడా సరదాగా మాట్లాడే అవకాశం ఎక్కువ దొరకలేదు.

వేసవి సెలవులకు పిల్లల్ని తండ్రి దగ్గరికి పంపాడు శ్యామలరావు. అతని మరదలు చంచల వచ్చింది, అక్కను చూద్దామని.

రెండు పదులు నిండి రెండేళ్ళు కావస్తూ ఉన్న చంచల మంచి అందగత్తె. డిగ్రీ పూర్తి అయిన రెండేళ్ళ నించి సంబంధాలు వస్తూనే ఉన్నా, కట్నం విషయం తేడా వచ్చి ఇంతవరకు ఒక్కటీ సెటిలవలేదు.

అక్కడికి వచ్చిన మరునాడే చంచల దృష్టిలో ఇట్టే పడ్డాడు చిరంజీవి. నాలుగు రోజులయ్యేసరికి ఒక ఇరవైసార్లన్నా అతణ్ణి దొంగచూపులు చూసింది. అతడి అందానికి ఎంతో మురిసిపోయింది. కాని, తనవంక కనీసం ఒక్కసారన్నా ఆకలిగా చూడని చిరంజీవి మీద ఎంతో కోపం వచ్చింది. నిజంగా ఇంత సీరియస్‌గా ఉంటాడా? లేక నటిస్తున్నాడా? అన్న అనుమానం కూడా వచ్చింది.

"ఇవాళ సెకండ్ షోకి వెళదాం. టికెట్స్ రిజర్వ్ చేశాను." క్లబ్బు నుంచి ఏడు గంటలకు తిరిగి వచ్చిన శ్యామలరావు అనౌన్సు చేశాడు.

మరో గంటలో బయలుదేరబోతూండగా "తల పగిలి పోతున్నంత నెప్పిగా ఉంది. నేను రాలేను, బాబూ" అంది చంచల. అయిష్టంగానే చంచలను విడిచి పెట్టి జాగ్రత్తగా తలుపు వేసుకుని పడుకోమని హెచ్చరించి, సినిమాకు బయలుదేరారు శ్యామలరావు దంపతులు.

గంట తరవాత మంచం మీద నుండి లేచింది చంచల. పదిన్నర దాటింది. బద్ధకంగా ఒళ్ళు విరుచుకొంది. పైట జారింది. అలాగే లేచి నిలువుటద్దం ముందుకు వచ్చింది. ముంగురులు సరిచేసుకుంటూ, తన అందానికి తనే మురిసిపోయింది. ఒక్కసారి చిరంజీవి రూపం కళ్ళముందు మెదిలింది. ఒళ్ళంతా వేడెక్కింది. పైట సరి చేసుకుని, ఏమీ తోచక వరాండాలోకి వచ్చింది.

చిరంజీవి గదిలో ఇంకా లైటు వెలుగుతూనే ఉంది. సుదర్శనం పోర్షన్ నుంచి ఎలాంటి అలికిడీ లేదు.

చంచలకు ఒక మంచి ఆలోచన వచ్చింది. మంచి అవకాశం కుదిరింది. తన కెలాగూ బోర్‌గా ఉంది. చిరంజీవి దగ్గరికి వెళ్ళి సరదాగా కాసేపు మాట్లాడి వస్తేనో? అతగా డంత సీరియస్‌గా ఉండటానికి కారణం కనుక్కోవాలి.

ధైర్యంగా వెళ్ళి చిరంజీవి గది తలుపు తట్టింది చిన్నగా. మంచం మీద పడుకొని, "హి వోంట్ నీడ్ ఇట్ నౌ" చదువుతున్న చిరంజీవి ఎవరా అని ఆశ్చర్యపోయాడు. వెళ్ళి తలుపు తెరిచి ఎదురుగా ఉన్న చంచలను చూసి నిర్ఘాంతపోయాడు. అప్పటి దాకా పట్టే లుంగీతో ఉన్న చిరంజీవి కంగారుగా వెనక్కు మళ్ళాడు, బనియన్ వేసుకొందుకు.

తలుపు దగ్గరగా వేసి, చిరునవ్వుతో లోపలికివచ్చింది చంచల. కంగారుతో నోట మాట రాలేదు చిరంజీవికి.

"ఈ వేళప్పుడు ఏమిటి ఇలా వచ్చారు? ఎవరన్నా చూస్తే..." తడబడ్డాడు చిరంజీవి.

"అందుకేగా ఎవరికీ తెలియకుండా అవకాశం చూసి వచ్చాను?"

ఆమె చొరవకు ఆశ్చర్యపోయి, "మీరు వచ్చిన పనేమిటో త్వరగా చెప్పండి" అంటూ చంచలను వెనక్కు పంపే ప్రయత్నం చేశాడు చిరంజీవి.

"మరీ ఆడపిల్లలా అంత కంగారేమిటి? ఏదో కాస్సేపు సరదాగా మాట్లాడిపోదామని వస్తే!" అందంగా నవ్వింది.

"ఈ వేళప్పుడా?" సీరియస్‌గా అడిగాడు చిరంజీవి.

ఏదో మాట్లాడదామని వచ్చిన చంచల నోట మాట లేకుండా అతడి వంక అలా చూస్తూ ఉండిపోయింది.

కట్ బనియన్‌లో అతడి విశాలమైన ఛాతీ ఆమెకు మత్తెక్కించింది. తనకు తెలియకుండానే ఆమె చేతులు అతడి మెడచుట్టూ పెనవేసుకున్నాయి. అతడి పెదవుల మీద ఆమె పెదవులు చోటు చేసుకున్నాయి. చంచల నాసికారంధ్రాల నుంచి వచ్చే వేడి నిట్టూర్పులు ఎంతో హాయి కలిగించినా, కర్తవ్యం స్ఫురణకు వచ్చింది చిరంజీవికి.

"ప్లీజ్, లీవ్ మీ! ఏమిటీ ఆవేశం? వదలండి" అన్నాడు, ఆమె చేతులను తొలగిస్తూ. తన నిగ్రహానికి తనే ఆశ్చర్యపోయాడు.

"చంచలా! చంచలా! ఎక్కడికి వెళ్ళావ్?" వరాండా నుండి వచ్చిన శ్యామలరావు కేకతో మత్తు వదిలింది చంచలకు. మెల్లిగా చిరంజీవిని వదిలింది.

శ్యామలరావు కేకకు చిరంజీవికి గుండె ఆగినంత పని అయింది. ఏం చెయ్యాలో తోచలేదు.

చంచల గుండె దడదడా కొట్టుకుంది. ఇప్పుడేం చెయ్యాలి? ఒళ్ళంతా చెమట పట్టింది చంచలకు. వాళ్ళేమిటి అప్పుడే వచ్చేశారు?

ఒక్కసారిగా వెళ్ళి తలుపు తెరవబోయింది ఇప్పుడిలా బయటికి వెళితే ఇంకేమైనా ఉందా? మెరుపులా ఒక ఆలోచన.

తన పైట తొలగించుకొంది చంచల. ముంగురులు చెల్లాచెదురు చేసుకొని చిరంజీవిని తనే గట్టిగా పెనవేసుకొని, "ఛీ! దుర్మార్గుడా! వదులు. ఏమిటిది? హెల్ప్! రక్షించండి!!" అంటూ గట్టిగా కేకలు ప్రారంభించింది.

తలుపులు తీసుకొని లోపలికి వచ్చిన శ్యామలరావు ఆ దృశ్యం చూసి నిర్ఘాంతపోయాడు.

"ఇన్నాళ్ళూ చాలా బాగా నటించావ్! ఇదన్న మాట నీ అసలు రూపం? ఏం మాట్లాడవేం?" గద్దించాడు శ్యామలరావు.

శ్యామలరావును చూడగానే కొండంత ధైర్యం వచ్చినట్టు వెళ్ళి అక్కను పెనవేసుకుని ఏడుపు ప్రారంభించింది చంచల.

చంచల మోసాన్ని గ్రహించాడు చిరంజీవి. తను ఎంత మొత్తుకున్నా ఏళ్ళిక వినరు. ఇప్పుడెలా? ఒళ్ళంతా చెమట పట్టింది.

ఈ హడావిడికి లేచి కళ్ళు నులుముకుంటూ బయటికి వచ్చాడు సుదర్శనం. వెంటనే జరిగిన విషయం అర్థం చేసుకున్నాడు.

"ఈ తప్పు చెయ్యడానికి ప్రయత్నించింది నేను కాదు. చంచల తనంతట తానే నా గదికి వచ్చింది." శ్యామలరావు గద్దింపుకి జవాబిచ్చాడు చిరంజీవి.

"ఘోరమైన అబద్ధం. మాయమాటలు చెప్పి నన్ను తన గదికి తీసుకు వెళ్ళాడు. నన్ను బలవంతం చెయ్యబోగా అరిచాను. అంతలోకే నీ గొంతు వినిపించింది, బావా! తరవాత మీరే వచ్చి తలుపు తోశారు. ఇదీ జరిగింది." ఏడుస్తూ, వగర్చుకుంటూ చెప్పింది చంచల.

నిస్సహాయంగా చుట్టూ చూశాడు చిరంజీవి. తనను ఇప్పుడెవరూ నమ్మరు.

ఎంతకాలం నుంచో చిరంజీవి మీద అక్కసుగా ఉన్న సుదర్శనం హుషారుగా ముందుకు వచ్చాడు. "పెద్ద బుద్ధిమంతుడులా వెధవ పోజులూ నువ్వూను. ఇదన్న మాట నీ అసలు రంగు!"

"నిజానిజాలు తెలియకుండా మీ ఇష్టం వచ్చినట్టు మాట్లాడకండి. నేనే తప్పు చెయ్యలేదు. నేనెవ్వరికీ భయపడవలసిన అవసరం లేదు." ధైర్యంగా జవాబిచ్చాడు చిరంజీవి.

"వీడిలా దారికి రాడు లెండి. దీని కొక్కటే మార్గం. పోలీసులకు ఫోన్ చేద్దాం. అసలింతకూ మీరీ రోజు సమయానికి తిరిగి వచ్చారు కనక సరిపోయింది. లేకపోతే ఎంత ఘోరం జరిగిపోయేదో!"

"అవునండి. మా చంచల అదృష్టమో ఏమో గాని, సినిమా హాల్లో కరెంటు ఎంతకూ రాకనూ, జెనరేటరు చెడిపోయినందు వల్లనూ వెంటనే ఇంటికి వచ్చాం గాని లేకపోతే..." శ్యామలరావు భార్య ఇంకేదో చెప్పబోయింది.

"మరేనండి. మన అదృష్టం బాగుంది. అయినా, వాణ్ణిలా వదలకూడదు. నాకు సబ్—ఇన్‌స్పెక్టర్ బాగా తెలుసు. ఎదురింటికెళ్ళి ఫోన్ చేసి వస్తాను" అంటూ బయలుదేరాడు సుదర్శనం.

అతనికి లోపల ఎంతో ఆనందంగా ఉంది — చిరంజీవి మీద అక్కసు తీర్చుకోటున్నందుకు.

శ్యామలరావు అతణ్ణి వద్దని వారిద్దామనుకొన్నాడు. కాని, ఎందుకో మౌనంగా వూరుకొన్నాడు.

సబ్—ఇన్‌స్పెక్టర్ అందర్నీ తలో నాలుగు ప్రశ్నలూ వేసి, చిరంజీవి మీద ఎటెమ్ప్ట్ టు రేప్ నేరానికి ఛార్జిషీట్ దాఖలు చేశాడు.

తాను నిర్దోషినని కోర్టులో మొత్తుకున్నాడు చిరంజీవి. కోర్టు అతడి ఆవేదన ఒక చెవితో వింది. ఇతగాడు తలపెట్టబోయిన అన్యాయాన్ని గర్హించాలని మరో మూడు కంఠాలు వంతగా పలికాయి. కోర్టు దాన్ని రెండవ చెవితో వింది.

మూడు కంఠాల ముందు ఒక్క కంఠం ఏం నిలుస్తుంది? చిరంజీవి దోషి అంది కోర్టు.

• • •

చిరంజీవి జైలు నుంచి బయటికి వచ్చి మూడు రోజులయింది. చిరంజీవి మేనమామ వరస అయ్యే ఎవరో దూరపు బంధువు తప్ప ఇంకెవరూ లేరు. ఇప్పుడక్కడికి వెళ్ళడం అనవసరం అని అతడికి తెలుసు.

అదీకాక అసలెక్కడికి వెళ్ళాలో, ఏం చెయ్యాలో ముందుగానే జైల్లోనే నిశ్చయించుకోవటం వల్ల ఎక్కడికి వెళ్ళాలన్నది అతనికి సమస్య కాదు.

సిటీ బస్ దిగి కాలనీలో అడుగు పెట్టాడు చిరంజీవి. ఉదయం పదకొండు గంటలు కావస్తోంది. భర్తల్ని ఆఫీసులకు, పిల్లల్ని స్కూళ్ళకు పంపి కాస్త తీరుబడిగా వరాండాల్లో కూర్చున్నారు గృహిణులు. ఒక్కొక్క ఇల్లూ చూసుకుంటూ ముందుకు పోతున్నాడు చిరంజీవి.


ఒక ఇంటి ముందు ఆగి, జేబులోంచి చిన్న కాగితం ముక్క తీసి డోర్ నంబర్ సరి చూశాడు. ఒకసారి అటూ, ఇటూ చూసి వరాండాలోకి వచ్చాడు. టక టక తలుపు తట్టాడు. ఎలాంటి రెస్పాన్స్ రాలేదు. కాలింగ్ బెల్ నొక్కాడు.

డోర్ తెరిచిన చంచల ఎదురుగా చిరంజీవిని చూసి నోట మాట లేకుండా నిలిచి పోయింది. వెంటనే తిరిగి డోర్ క్లోజ్ చెయ్యబోయింది. కానీ, చిరంజీవి తలుపు తోసుకుని లోపలికి వెళ్ళి ఆ పని తనే చేశాడు.

కెవ్వున అరవబోయింది చంచల. నోరు తెరవకుండా గట్టిగా చెయ్యి వేశాడు. "అప్పుడు చెయ్యని నేరానికి నన్ను నిర్దాక్షిణ్యంగా జైలుకు పంపావు. ఇప్పుడు నేను అదే నేరం చేస్తాను. నీకు దిక్కెవరు?" కసిగా అన్నాడు చిరంజీవి.


చంచల నిలువునా వణికి పోయింది. కళ్ళ వెంట నీళ్ళు జలజలా కారుతున్నాయి.

అంతవరకు చంచల నోటికి అడ్డుగా పెట్టిన చెయ్యి తొలగించాడు చిరంజీవి.



ఇంద్రకీలాద్రి నుంచి

ఫోటో— మురళీకృష్ణ పాండే (త్రిపురాంతకం)



"నీకు చేతు లెత్తి నమస్కారం చేస్తాను. నన్నేం చెయ్యకు, చిరంజీవీ!"

"నమస్కారం! హః! నా భవిష్యత్తు నాశనం చేశావు. అందుకు ప్రతిగా నాకు నమస్కారం చేస్తే సరిపోతుందా?"

"తొందరలో అప్పుడు నోరు జారాను. ఇంత ఘోరం జరుగుతుం దనుకోలేదు, చిరంజీవీ. ఇప్పుడు నన్ను నాశనం చేస్తే నీకు మంచి భవిష్యత్తు తిరిగి వస్తుందా?"

"రాదు! ఆ సంగతి నాకు బాగా తెలుసు. అంత దాకా ఎందుకు? నీ భర్త వచ్చేవరకు మన మిలా మాట్లాడుకుంటూ ఉంటే చాలు. నీ సంసారం నాశనం కావడానికి క్షణం పట్టదు."

భయంగా బిక్కు బిక్కుమంటూ చూస్తూ గోడవారగా నిలబడింది చంచల. ఇప్పుడు తను తప్పించుకునే అవకాశం లేదు.

చిరంజీవి డోర్ సరిగ్గా లాక్ చేసి వచ్చి జేబు లోంచి కర్చీఫ్ తీసి ముఖానికి పట్టిన చెమట తుడుచు కున్నాడు చిరాకుగా. ఫ్రిజ్ వద్దకు నడిచి ఒక గ్లాసుడు నీళ్ళు గడగడా తాగాడు. తిరిగి వచ్చి సోఫాలో కూర్చుని టీపాయ్ మీద ఉన్న టేప్ రికార్డర్ ఆన్ చేశాడు. జాజ్ మ్యూజిక్ వింటూ టేప్ రికార్డర్ పరిశీలించసాగాడు.

ఏ క్షణాన ఏం చేస్తాడో నని భయపడుతూ బిత్తర చూపులు చూస్తూ ఉంది చంచల.

మ్యూజిక్ ఆకస్మికంగా ఆపి, పైకి లేచి ఆవేశంగా చంచల దగ్గరికి నడిచాడు. చంచలను లాక్కు వచ్చి సోఫామీదికి తోశాడు, కోపంగా.

చంచల పై ప్రాణాలు పైనే పోయినంత పని అయింది.

"ఇప్పుడు చెప్పు, నేను నిన్ను రేప్ చెయ్యబోయి నట్టు దారుణంగా ఎందుకు అబద్ధం చెప్పావు?"

భయపడుతూ నెమ్మదిగా చెప్పటం ప్రారంభించింది.

"ఇందులో నీకు తెలియని దేముంది, చిరంజీవీ! ఆ క్షణం నీ గదిలో నుంచి బయటికి రావటం చూస్తే అక్కా, బావా నన్ను బతకనిస్తారా? వాళ్ళకు నా ముఖం ఎలా చూపించేది? వాళ్ళు నిన్ను నాలుగు కేకలేసి వదిలేస్తా రనుకున్నాను. కాని, ఇంత దారుణం జరుగుతుందని వూహించ లేదు. నీకు శిక్ష పడిందని తెలిసినప్పుడు నిజం చెప్పేద్దామనుకున్నాను. కాని, అప్పుడుకూడా అక్కా బావల పరువు గురించి ఆలోచించి గుట్టుగా వూరుకున్నాను. నీకు నా మూలంగా జరిగిన అన్యాయానికి ప్రతి క్షణం బాధ పడుతూనే ఉన్నాను."

చెప్పడం ముగించి ఇంకా భయంగా చూసింది చంచల.

"ఏం? ఎందు కలా భయపడతావు? నీకు ఉన్నంతటి నీచత్వం నాలో లేదు. కేవలం నీ మర్యాద నిలుపుకోవ డానికి నిర్దాక్షిణ్యంగా అబద్ధ మాడి నా జీవితాన్ని నాశనం చేశావు. ఇప్పు డవకాశం దొరికింది కదా? నేనూ అదే పని చేస్తే ఇక నీకూ, నాకూ తేడా ఏమిటి?" కటువుగా ప్రశ్నించాడు చిరంజీవి.

ఈ మాటతో భయం పోయి కాస్త తేరుకున్నా,



డీవ

చిత్రం— ఎస్. శివకుమార్ (వరంగల్)

సిగ్గుతో కుంచించుకు పోయింది చంచల.

టేప్ రికార్డర్ రీవైండ్ చేసి, అప్పటి వరకూ తమ మధ్య జరిగిన సంభాషణ సరిగ్గా వచ్చినందుకు సంతోషించి ఇజెక్ట్ బటన్ నొక్కి, కాసెట్ బయటికి తీసి జేబులో వేసుకున్నాడు.

అతని చర్యకు కాస్త ఆశ్చర్యంగా చూసింది చంచల.

"వస్తాను" అంటూ తలుపు తీసి బయటికి వడివడిగా నడిచాడు చిరంజీవి.

గుమ్మంలో నిలబడి అతడు కనుమరుగయ్యేవరకు అలాగే చూస్తూ ఉండిపోయింది చంచల. ★